క్లుప్తంగా

14న మకరజ్యోతి దర్శనం



విశేష అలంకరణలో అయ్యప్పస్వామి

అల్లిపురం: అయ్యప్ప స్వామి మకర జ్యోతి పూజ, దర్శనం ఈ నెల 14వ తేదీన టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు సాయిశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగే ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, జ్యోతి దర్శనం చేసుకుని తరించాలని కోరారు.

26 నుంచి కాంగ్రెస్ పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న గొంప గోవిందరాజు

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఈ నెల 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర విశాఖలో ప్రారంభం కానుందని ఆ పార్టీ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ నాయకులతో వారు సమావేశమయ్యారు. కాంగ్రెస్ పెద్దలు సోనియాగాంధీ నేతృత్వంలో రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర విజయవంతంగా సాగుతుందన్నారు. పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, మూలే వెంకట్రావు, బమ్మిడి గంగాధర్, గుత్తుల శ్రీనివాస్, సోడదాసి సుధాకర్, హైదర్ ఆలీ షింకా, వేగి వెంకటేష్, భగత్, రామారావు, నూకరాజు, కాకినాడ చిన్నబాబు, బొడ్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పరెడ్డికి ఎమ్మెల్యే వాసుపల్లి పరామర్శ



అయ్యప్పరెడ్డి తల్లికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నీలాపు అయ్యప్ప రెడ్డి తల్లి శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అయ్యప్పరెడ్డి ఇంటికి చేరుకుని ఆమె భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అయ్యప్పరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట పాల శ్రీహరి రెడ్డి, చినిపిల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుందని చెప్పారు.

సదా శ్రీహరి సేవలో..



శ్రీహరిని కీర్తిస్తూ..

గంగిరెద్దులు.. గొబ్బెమ్మలు.. గాలిపటాలు.. రేగుపళ్లు.. చెరకు ముక్కలు.. చక్రపొంగలి.. కొత్తబట్టలు.. ఇలా సంక్రాంతి పండగ అనగానే గుర్తుకొచ్చే వాటిలో ముఖ్యమైన అంశం మరొకటి ఉంది. అదే.. హరిదాసులు. మన సంస్కృతీ సంప్రదాయాలకు పట్టుగొమ్మలుగా నిలిచే వాటిలో మిగతావి ఎంతో ప్రముఖమైనవో.. హరిదాసుల వైనం కూడా అంతే అని చెప్పొచ్చు. హరినామ సంకీర్తన చేస్తూ రంగవల్లులతో తీర్చిదిద్దిన ఇళ్ల ముందు మహిళలు హరిదాసులకు బియ్యం.. డబ్బులు సమర్పించే దృశ్యాలు మన తెలుగు వైభవానికి పెట్టనికోటలు. ధనుర్మాసం మొదలైన నాటి నుండి నెలరోజుల పాటు హరిదాసుల సందడి కనిపిస్తుంది. హరిదాసులు పురవీధుల్లో హరినామ సంకీర్తనలు.. విష్ణుపారాయణ చేస్తూ పల్లెలకు.. పట్నాలకు ఆధ్యాత్మికతను అద్దుతారు. అలా నలభై ఏళ్ల నుండి హరిసేవలో నిమగ్నమై.. స్వామి సేవలో తన్మయులైన రాంబిల్లిలోని నారాయణపురం వాసి కందుల అప్పలరాజు హరిదాసుగా తన అనుభవాలను, ఆధ్యాత్మిక పయనాన్ని సాక్షికి అందించారు. *విశాఖపట్నం డెస్క్*

- పల్లెలు.. పట్నాల్లో ఆధ్యాత్మికతను పంచుతున్న హరిదాసులు
- అపార్ట్‌మెంట్ల సంస్కృతితో ఆదరణ తగ్గుతుందని ఆవేదన
- కళాకారుల పింఛన్ అందజేయాలని అభ్యర్థన

ధనుర్మాసం తొలి రోజు నుండి నెల రోజుల పాటు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం వరకు హరినామ సంకీర్తన, విష్ణుసహస్రనామ పారాయణ చేస్తూ అన్ని వీధులు తిరుగుతూ ప్రజల నుండి బియ్యం, పండ్లు, నగదు స్వీకరిస్తారు. ఇందుకు గాను అప్పలరాజు హరిదాసు రాంబిల్లిలోని స్వగ్రామమైన నారాయణపురం నుండి నగరంలోని అక్కయ్యపాలేనికి మకాం మార్చి ఇక్కడ ఒక గది అద్దెకు తీసుకుని సంకీర్తన సేవ చేస్తున్నారు. హరిదాసులంటే సమాజ శ్రేయస్కులని చెబుతారు అప్పలరాజు హరిదాసు. తాము చేస్తున్నది సర్వ జీవ క్షేమ యాగమంటారు. సనాతన ధర్మాన్ని సంపూర్ణంగా పరిరక్షించడమే హరిదాసుల లక్ష్యమని ఆయన తెలిపారు.

తలపై ఒక పాత్రగా హరిని ధరించి

ధనుర్మాసం నెలరోజులు తాము తమ శిరస్సుపై ఒక పాత్రగా హరిని ధరిస్తామని అప్పలరాజు హరిదాసు చెబుతున్నారు. ఆ పాత్రలో భక్తులు, ప్రజలు వేసే బియ్యం.. పండ్లు.. నగదు లక్ష్మీ సమానమని విశదీకరించారు. హరిని శిరస్సుపై మోస్తూ.. సంకీర్తన చేస్తూ సాగిపోతుండగా.. వెనుదిరిగి చూడడం.. ఎవరితోనూ మాట్లాడడం.. యాచించడం.. ఆగడం నియమానికి విరుద్ధమని తెలిపారు. భక్తులు సమర్పించినదే స్వీకరిస్తామన్నారు.

ఉదయం నుండి ఉపవాసమే..

ధనుర్మాసం నెలరోజులు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం వరకు ఏమీ భుజించకుండా హరిపాత్రను తలపై నుండి దించిన తర్వాత మాత్రమే రాత్రికి భుజిస్తామని.. ఇలా నెలరోజులు ఒంటిపూట మాత్రమే భోజనం చేస్తామని అప్పలరాజు హరిదాసు తెలిపారు.

దెబ్బతీస్తున్న అపార్ట్‌మెంట్ల సంస్కృతి

హరిదాసులకు పూర్వం ఎంతో వైభవం.. ఆదరణ ఉండేవని అప్పలరాజు హరిదాసు తెలిపారు. పల్లెలు.. పట్నాల్లో కూడా తమను భక్తులు, ప్రజలు ఎంతగానో ఆదరించేవారని తెలిపారు. అయితే అపార్ట్‌మెంట్ల సంస్కృతి వచ్చాక తమకు ఆదరణ తగ్గిందని అన్నారు. దీనికి కారణం అపార్ట్‌మెంట్లలో ఉండే వారికి తమ రాక తెలియడంలేదని.. ఒకవేళ తెలిసినా వారు తమ ఫ్లాట్ల నుండి వీధిలోని తమ వద్దకు రాలేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు.

ఉత్తరాంధ్రలో 130 మంది హరిదాసులు

ఉత్తరాంధ్రలో దాదాపు 130 మంది వరకు హరిదాసులు ఉన్నారని అప్పలరాజు హరిదాసు తెలిపారు.



హరిదాసుతో చిన్నారి అడుగులు..

తమ సంఘానికి మైచర్ల అప్పారావు అధ్యక్షుడని.. తాను ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక భావన.. హిందుత్వంపై మక్కువ ఉన్న వారు ఎవరికైనా తాము శిక్షణ ఇచ్చి హరిదాసులుగా మలిచేందుకు సిద్ధమేనని తెలిపారు. అయితే సరైన ఆదరణ, ప్రోత్సాహం లేకపోవడం వల్ల హరిదాసులుగా ఆధ్యాత్మికను చాటి చెప్పే గురుతర బాధ్యతను నెత్తికెత్తుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

12వ ఏట నుండే హరిదాసుగా..

ఇప్పటికి దాదాపు 40 ఏళ్ల కిందటి నుండి తాను హరిదాసుగా దైవసేవలో ఉన్నట్లు అప్పలరాజు హరిదాసు తెలిపారు. అప్పుడు తన వయసు పన్నెండేళ్లని ఆయన స్పష్టం చేశారు. తాము దాసరి వైష్ణవులమని.. తాను పౌరోహిత్యం చేస్తూ ధనుర్మాసం నెలరోజులు హరిదాసుగా నియమ నిష్ఠలతో స్వామి సేవకు అంకితం అవుతానని తెలిపారు. తనకు వివాహం అయిందని.. ఒక కుమారుడు.. ఇద్దరు కుమార్తెలు సంతానమని తెలిపారు. కుమారుడు డిగ్రీ చదువుతుండగా.. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు అయ్యాయని తెలిపారు.



కృష్ణార్పణం.. బియ్యం స్వీకరిస్తూ..

కళాకారుల పింఛన్‌తో ఆసరా కల్పించాలి

హరిదాసులకు ప్రోత్సాహం కల్పించాలని.. వారికి కళాకారుల పింఛన్ అందించాలని తాము ఒకప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అభ్యర్థించామని అప్పలరాజు హరిదాసు తెలిపారు. చూద్దాం అని చెప్పిన ఆయన తర్వాత ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. హరిదాసులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని కోరుతూ తాము గత ఐదేళ్ల నుండి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు అసలు సిసలైన గుర్తుగా భాసిల్లే హరిదాసులకు ప్రోత్సాహం లభించకపోతే కొన్నాళ్లకు హరిదాసులనేవారు కనిపించరని.. అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వెలిబుచ్చారు.

ఎమ్మెల్యే ఔదార్యం



బాధితుడు అప్పారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: కొబ్బరితోటకు చెందిన పాట్లేలు అప్పారావు విద్యుదాఘానికి గురై కుడికాలు కాలిపోవటంతో ఇంట్లోనే ఉండి చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందని తెలుసుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బాధితుడి ఇంటికి వెళ్లి అతన్ని పరామర్శించి.. సొంత నిధుల నుంచి రూ.5 వేలు ఆర్థిక సహకారం అందించారు. పరామర్శించిన వారిలో వార్డు నాయకులు లండా రమణ, లింగం శ్రీను, దూడ అప్పారావు, భాస్కరరావు, అశోక్, చిన్న, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

18న 'సినిమా బండి' చిత్ర ప్రదర్శన

దాబాగార్డెన్స్ : ఈ నెల 18న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విశాఖ నగరానికి చెందిన యువ దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో రూపొందిన 'సినిమా బండి' చిత్రం ఉచిత ప్రదర్శన ఉంటుందని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సినిమా బండి ఉచిత ప్రదర్శన పోస్టర్‌ను వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రదర్శన అనంతరం చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగులతో ముఖాముఖి నిర్వహించనున్నట్టు చెప్పారు. సినిమా బండి చిత్రం 2022 గోవా అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్లో కూడా ప్రదర్శితమై పలువురి ప్రశంసలు పొందిందని చెప్పారు. సినీ కథా రచయిత సత్యాడ నరసింగరావు, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ జి. బాబ్జి, ఆర్. శివకుమార్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు

అల్లిపురం: సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధి, వుడ్ యార్డ్, బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట సచివాలయాల ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. హరిదాసు కీర్తనలు, చిన్నారుల కూచిపూడి నృత్యాలు, బావా మరదళ్ల సరసాలు, సంక్రాంతి పాటలు అలరించాయి. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, సింగపూర్ ఎన్‌ఆర్‌ఐ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పిల్లి సంతోష్‌కుమార్‌రెడ్డి, వై.చిన్నమ్ములు, నీలాపు అయ్యప్పరెడ్డి, చిలిపిల్లి శ్రీనివాసరెడ్డి, సీరపు ప్రసాదరెడ్డి, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొని భోగి మంటలు వేసి పాటలు పాడారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శులు రియాజ్, త్రివేణి, ప్రత్యూష, నంబాల కిరణ్, పీపీ కిరణ్‌కుమార్, భార్గవ్ తదితరులు మాట్లాడుతూ ఈ ఏడాది సంక్రాంతి ప్రత్యేకంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేసి తమ కుటుంబాల్లో క్రాంతిని నింపటంతో ఈ ఏడాది సంక్రాంతి జీవితంలో మరిచిపోలేనిదని హర్షం వ్యక్తం చేశారు. వార్డు ప్రజలందరికీ వారు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



భోగి మంటల సందడిలో సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు

సత్తా చాటిన ఆంధ్రా బాడీ బిల్డర్లు

మిస్టర్ ఇండియా పోటీల్లో రన్నరప్‌గా రాజేష్



మిస్టర్ ఇండియా పోటీల్లో సత్తా చాటిన రాజేష్

అల్లిపురం : పశ్చిమబెంగాల్లో ఈ నెల 11,12 తేదీల్లో జరిగిన 57వ మిస్టర్ ఇండియా–2023 పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొని తమ సత్తాచాటారు. దేశ నలుమూలల నుంచి 29 రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 65 కేజీల విభాగంలో పోటీపడ్డ రాజేష్ ప్రథమ స్థానంతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ రన్నరప్‌గా నిలిచి ఆంధ్రప్రదేశ్ కీర్తి, ఖ్యాతిని దేశం నలుమూలలా చాటారు. అలాగే 70 కేజీల కేటగిరీలో సంగడి రమేష్ ద్వితీయ స్థానం సాధించగా, 80 కేజీల విభాగంలో నార్ని శివదుర్గా అవినాష్ మూడో స్థానం సాధించారు. మాస్టర్ విభాగంలో కె.రామునాయుడు నాలుగో స్థానంలో సత్తా చాటారు. ఏపీ నుండి పాల్గొన్న వారందరూ టాప్ 10లో నిలిచారు. మిస్టర్ ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన వారందరికీ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.గురునాథరావు, కోశాధికారి టి.రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వి.విజయకుమార్, జోగి కిరణ్, ఉపాధ్యక్షుడు బీపీ రెడ్డి, జి.విష్ణుమూర్తి అభినందనలు తెలిపారు.

ఫ్రైడే డ్రైడేపై అవగాహన



తులసిపేటలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రామా టాకీసు ప్రాంతం దరి తులసిపేటలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మంచినీటిపై మూతలు సరిగా ఉంచుకోవాలని, డెంగ్యూ నివారణ పద్ధతులు, మలేరియా నిర్మూలన పట్ల స్థానికులకు అవగాహన కల్పించారు. దోమల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేసిన ఘనత ప్రధాని మోదీదే

మహారాణిపేట : ప్రపంచ స్థాయిలో భారతావనికి గౌరవం పెంపొందించిన ఘనత భారత ప్రధాని మోదీకే దక్కిందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. శుక్రవారం శ్రీ గాయిత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో భోగి, సంక్రాంతి సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానికి, స్వాతంత్ర్య సమరయోధులు రూపాకుల సుబ్రహ్మణం, ఎస్.దక్షిణామూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, సుబ్రహ్మణ్యం, గేదెల శ్రీహరి, వై.సత్యనారాయణ, శేషులత, మంగ రమణ, కొండమ్మ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ ఆర్గనైజర్లు

దాబాగార్డెన్స్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటుకు మంచి అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంఏ రహీం తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లతో పీఎంఎఫ్‌ఎంఈ స్కీంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం ద్వారా ఆహార శుద్ధి రంగంలో గల వివిధ అవకాశాలు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. కొత్తగా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు నిరుద్యోగ యువత, స్వయం సహాయక బృందాలు, సభ్యులు ఒక్కరిగా గానీ, గ్రూప్‌గా గానీ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని చెప్పారు. పీఎంఎఫ్‌ఎంఈ స్కీం ద్వారా కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుకయ్యే మొత్తం ఖర్చులో 10 శాతం రుసుం లబ్ధిదారులు భరించగా, 90 శాతం రుసుం బ్యాంక్ ద్వారా లోన్ రూపంలో అందజేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమ ఏర్పాటు పూర్తయిన తర్వాత ప్రభుత్వ సహకారంగా 36 శాతం సబ్సిడీ బ్యాంకుకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. గరిష్టంగా ప్రభుత్వ సబ్సిడీ రూ.10 లక్షల వరకు సహాయం చేసే అవకాశాలున్నాయని చెప్పారు. ఇప్పటికే ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉన్న వారు, ప్రస్తుతం ఉన్న పరిశ్రమను ఇంకా అభివృద్ధి చేసుకోవడానికి కూడా ఈ సబ్సిడీ పొందవచ్చన్నారు. ఆసక్తి గల వారు 7995087039, 6304930318, 9700051235 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ కె. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లు కళకళ

సీతంపేట: సంక్రాంతి పండగను పురస్కరించుకుని జనంతో మార్కెట్లు కళకళలాడాయి. శనివారం భోగి పండగ కావడంతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని దుకాణాల్లో దుస్తులు, పూజా సామగ్రి, చెరకు గడల విక్రయాలు జోరుగా సాగాయి. కొనుగోలుదారుల రద్దీతో మార్కెట్ ప్రాంతమంతా సందడిగా మారింది.

యార్డులో చెత్త తరలింపుపై ఆరా

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 డంపింగ్ యార్డుకు వచ్చే చెత్త వివరాలపై జెడ్సీ కె.శివప్రసాద్ శుక్రవారం ఆరా తీసి.. డంపింగ్ యార్డును పరిశీలించారు. యార్డులో ఎన్ని క్లోజ్ కాంపాక్టులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. యార్డుకు ఎన్ని టన్నుల చెత్త వస్తుంది.. క్లోజ్ కాంపాక్టుల ద్వారా ఎంత చెత్త తరలివెళ్తుంది.. అనే విషయాలపై రికార్డులు తనిఖీ చేశారు. గతంలో పలుమార్లు చెత్తను క్లియర్ చేసిన సందర్భాలు ఈ యార్డులో ఉన్నప్పటికీ.. ఇప్పుడెందుకు పేరుకుపోతుందని ప్రశ్నించారు. పేరుకుపోయిన చెత్త వలన అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వెంటనే చెత్తను తొలగించాలన్నారు. క్లోజ్ కాంపాక్టుల ద్వారా 1400 టన్నులు బయటికి వెళ్లాలన్నారు. కాటాలో అవకతవకలు జరిగితే కఠినచర్యలు తప్పవన్నారు. కాటా వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. యార్డులో ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారు, రోజూ ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి అనే వివరాలు కూడా పొందుపరచాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం జోన్ పరిధిలో నిత్యం చెత్తపడే ప్రాంతాలను పరిశుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డులో క్లోజ్ కాంపాక్టులను పరిశీలిస్తున్న జెడ్సీ శివప్రసాద్

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం 34వ వార్డు అచ్చియ్యమ్మపేట జంక్షన్, వైఎస్సార్ విగ్రహం వద్ద, 36వ వార్డు జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన ఏర్పడింది. ఈ సందర్భంగా 36వ వార్డు గన్నేరువీధిలో నివసిస్తున్న నిరుపేద ముస్లిమ్ మీర్జా మెహిద్ బేగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని తెలిసి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు, 37వ వార్డు జాలారిపేటకు చెందిన నిరుపేద మహిళ మందుల ఖర్చుల నిమిత్తం రూ.2 వేలు, 38వ వార్డులో నివసించే నిరుపేద మహిళకు పండగ బట్టలకు రూ. వెయ్యి, 34వ వార్డులో కరెంట్ షాక్‌కు గురైన వ్యక్తికి రూ.5వేలు, పెన్షన్ రాని అవ్వకు రూ.2 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల వినతులకు స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 33వ వార్డు వెంకటేశ్వరమెట్టకు చెందిన తాడ్డి అనురాధకు ఆశ వర్కర్‌గా పోస్టింగ్ వచ్చినందుకు ఆమెను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యేను ఆమె సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో 34వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, ఎం.రమేష్, పాల శ్రీహరిరెడ్డి, బొర్రా శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి, రామానంద్, దూడ అప్పారావు, భాస్కరరావు, అశోక్, చిన్న, గోవింద్ కార్యకర్తలు, 36వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాసిపోగు రాజు, 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, చిన్ని, సీనియర్ నాయకులు రమణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



జామియా మసీదు వద్ద మీర్జా మెహిద్ బేగ్‌కు ఆర్థిక సహకారం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

శాస్త్రోక్తంగా నృసింహ దీక్ష విరమణ

సింహాచలం: అడవివరానికి చెందిన సింహాద్రి మఠం ఆధ్వర్యంలో శ్రీనృసింహ దీక్షల విరమణ శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగింది. మండల దీక్ష, 32రోజుల దీక్ష చేసిన 3860 మంది భక్తులు సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో దీక్షా విరమణ చేశారు. దీక్ష విరమించినవారిలో విశాఖ ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దీక్షాదారులంతా ఘాట్‌రోడ్డు, మెట్లమార్గంలో తిరుముడులతో సింహగిరికి చేరుకున్నారు. అనంతరం సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దీక్ష విరమణ చేశారు. దేవస్థానం తరఫున దీక్షాదారులందరికీ స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.



తిరుముడులతో వస్తున్న దీక్షాధారులు

ముగిసిన స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు

అల్లిపురం: వన్‌టౌన్‌లోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీ స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు పీవీఎన్ మాధవ్ పాల్గొని 500 మందికి దుప్పట్లు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివేకానందుని అడుగుజాడల్లో అందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు సీఎంఏ జహీర్ అహ్మద్, డాక్టర్ రమణమూర్తి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, రౌండ్ టేబుల్ సభ్యులు మక్సూద్ అహ్మద్, ఉరుకూటి నారాయణరావు, చెన్నా జానకీరామ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేస్తున్న అతిథులు పీవీఎన్ మాధవ్, సీతంరాజు సుధాకర్ తదితరులు